

'పొత్తు గెలవాలి... పాలన మారాలి'

'పొత్తు గెలవాలి... పాలన మారాలి' నినాదంతో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు శుక్రవారం ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేశారు.

- వార్త I పేజీలో



మేనిఫెస్టో విడుదల చేస్తున్న శ్రీభరత్, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, నాగేంద్ర, బొలిశెట్టి సత్య

మేనిఫెస్టోలోని అంశాలు...

1. స్టీల్‌ప్లాంటును కాపాడుకోవడం, 2. వాల్తేరు డివిజన్‌తో కూడిన విశాఖ రైల్వే జోన్‌ను సాధించడం, ప్రజల అవసరాల మేరకు మరిన్ని రైళ్లను తీసుకురావడం, 3. గోదావరి జలాలతో విశాఖ పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చడం, 4. ఐటీ, టూరిజం, పారిశ్రామిక హబ్‌గా విశాఖను అభివృద్ధి చేసి లక్ష ఉద్యోగాలను కల్పించడం, 5. పోర్టు కాలుష్యాన్ని నియంత్రించడం, 6. విశాఖలో శాంతి, భద్రతలను పరిరక్షించడం, 7. ప్రభుత్వ, ప్రజల ఆస్తులను పరిరక్షించడం

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

మహారాణిపేట, ఏప్రిల్ 5: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పూలమాల వేసి నివాళులర్పించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో మోహనకుమార్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి రామారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆశలు వమ్ము

పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్

- తెలంగాణలో కంటే ఎక్కువ వేతనం ఇస్తామన్న వైసీపీ అధినేత

- గడిచిన ఐదేళ్లలో ఒకే ఒక్కసారి వేయి రూపాయలు పెంచిన ప్రభుత్వం
- ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9,000
- ఇక్కడ రూ.11,500, ఆయాకు రూ.7,000 మాత్రమే...
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు వంటి డిమాండ్లపైనా దాటవేత
- 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేసిన సిబ్బంది
- సమ్మె కాలానికి వేతనం చెల్లించని వైనం

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):

గత ఎన్నికల ముందు అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయారు. ముఖ్యంగా తెలంగాణలోని అంగన్‌వాడీ సిబ్బంది కంటే ఎక్కువ వేతనాన్ని చెల్లిస్తామని, ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని పాదయాత్ర సమయంలో ఊరూరా హామీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించారు. ఒకే ఒక్కసారి మాత్రం వేయి రూపాయల వేతనాన్ని పెంచారు. అయితే తెలంగాణ కంటే ఎక్కువ ఇస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేకపోయారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీల ధర్నా (ఫైల్ ఫొటో)

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని అంగన్‌వాడీ సిబ్బంది వాపోతున్నారు. జగన్ సర్కారు అంగన్‌వాడీ సిబ్బందికి తీరని అన్యాయం చేసిందని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను గుర్తించకపోవడం దారుణమని ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేసిన కాలానికి వేతనాలు చెల్లిస్తామని చెప్పిన హామీని కూడా ఇప్పటివరకూ ఈ ప్రభుత్వం అమలు చేయలేదని నగర పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేసింది.

ఎన్నికల వేళ ఇచ్చిన హామీ

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసిన జగన్మోహన్‌రెడ్డి...అన్ని వర్గాలకు మాదిరిగానే అంగన్‌వాడీ సిబ్బందికి కూడా పలు హామీలు ఇచ్చారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి అండగా ఉంటానని, పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతోపాటు తెలంగాణలో కంటే వేయి రూపాయలు వేతనం అదనంగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.10,500, ఆయాకు రూ.6,000 వేతనంగా చెల్లించేవారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒకసారి వేయి చొప్పున వేతనాన్ని పెంచారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం కూడా పీఆర్‌సీని అమలు చేయడంతో అక్కడి సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. కానీ, ఇక్కడ జగన్ ప్రభుత్వం కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7,000 మాత్రమే ఇస్తోంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు వేయి చొప్పున అదనపు వేతనం ఇవ్వాలంటే కార్యకర్తకు రూ.14,500, ఆయాకు రూ.10 వేలు



... మిగతా 6వ పేజీలో

ఇచ్చిన హామీలను జగన్ అమలు చేయలేదు

- వై.తులసి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



అంగన్‌వాడీ సిబ్బందికి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. వేతనం తెలంగాణలో కంటే వేయి రూపాయలు అదనంగా ఇస్తామన్నారు. అడిగినా ప్రభుత్వం స్పందించలేదు. ఇతర సమస్యలను పట్టించుకోలేదు. అందుకే నిరవధిక సమ్మెకు దిగాం. సమ్మె చేస్తున్న తమతో చర్చలు జరిపిన ప్రభుత్వ పెద్దలు... అప్పుడు ఇచ్చిన హామీలను ఇప్పటివరకూ అమలు చేయలేదు. సమ్మె కాలానికి వేతనం చెల్లించలేదు. ఇతర హామీలకు సంబంధించిన జీవోలు విడుదల చేయలేదు. అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి.

రౌడీషీటర్ల వద్ద తుపాకులు



- ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో కొనుగోలు
- సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు వినియోగం
- పోలీసుల నిఘా లేకపోవడంతో వెలుగులోకి రానివైనం
- తాజాగా వారం వ్యవధిలో ముగ్గురి వద్ద తుపాకీలు లభ్యం
- వీరిలో ఇద్దరు రౌడీషీటర్లు
- లోతుగా దృష్టిసారిస్తే మరిన్ని బయటపడే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో తుపాకీ సంస్కృతి చాపకింద నీరులా విస్తరిస్తోంది. కొంతమంది రౌడీషీటర్లు అడ్డదారిలో తుపాకీలను సమకూర్చుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్, బిహర్ వంటి రాష్ట్రాల తుపాకులను తెప్పించుకుంటున్నారు. వాటిని సెటిల్‌మెంట్‌లు, ఇతరులను బెదిరించడం కోసం వినియోగిస్తున్నారు. వారం వ్యవధిలో నగరంలో మూడుచోట్ల లైసెన్స్ లేని తుపాకీలను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 728 లైసెన్స్ తుపాకీలు ఉన్నాయి. ఇవి కాకుండా కొంతమంది రౌడీషీటర్లు, యువకుల వద్ద లైసెన్స్ లేని పిస్టల్, రివాల్వర్లు ఉన్నాయి. రాజకీయ నేతల అండదండలు కలిగిన కొంతమంది రౌడీషీటర్లు బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి పిస్టల్, రివాల్వర్లలను తెప్పించుకుంటున్నారు. వాటిని చూపించి దందాలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. నగరంలో 650 మంది రౌడీషీటర్లు ఉండగా వీరిలో దాదాపు వంద మంది వరకూ రివాల్వర్, పిస్టల్, నాటు తుపాకీ వంటి వాటిని కలిగి ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం నగరంలో లైసెన్స్ కలిగిన తుపాకీలను పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకుని స్టేషన్లలో డిపాజిట్ చేశారు. ఇలాంటి పరిస్థితిలో కేవలం వారం రోజుల వ్యవధిలో మూడుచోట్ల తుపాకీలు లభ్యంకావడం చర్చనీయాంశంగా మారింది. వన్‌టౌన్‌లో ఒక రౌడీషీటర్ రివాల్వర్‌తో తన ప్రత్యర్థిని ... మిగతా 6వ పేజీలో



బోసిపోయిన ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి

మండిన విశాఖ

వడగాడ్పులతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి

- పద్మనాభంలో 44 డిగ్రీలు, భీమిలిలో 43 డిగ్రీలు నమోదు
- నేడు, రేపు కూడా ఎండలు, గాడ్పులు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ హెచ్చరిక
- జిల్లా వ్యాప్తంగా ఓఆర్‌టీ కార్నర్స్ సెంటర్లు ఏర్పాటు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):



విశాఖ నగరం, పరిసర మండలాలు శుక్రవారం ఎండకు మండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ కొనసాగింది. పలుచోట్ల తీవ్ర వడగాడ్పులు, మరికొన్నిచోట్ల గాడ్పులు వీచాయి. ద్విచక్ర వాహనాలపై తిరిగే వారంతా ముఖాలకు రుమాళ్లు కట్టుకుని ప్రయాణించాల్సి వచ్చింది. జిల్లాలో పలుచోట్ల 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పద్మనాభంలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే భీమిలిలో 43, ఆనందపురంలో 41.9, పెందుర్తి, గాజువాకల్లో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శని, ఆదివారాలు కూడా జిల్లాలో పలుచోట్ల వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి ఆరోగ్య శాఖ పలు సూచనలు, సలహాలను విడుదల చేసింది. ప్రజలు ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని సూచించింది. లేత వర్ణం, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలి. నలుపు, మందంగా ఉండే దుస్తులు ధరించకూడదు. రోజూ కనీసం 15 గ్లాసుల నీటిని తీసుకోవాలి. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. భోజనం మితంగా చేయాలి. ఎండ వేళ ఇంట్లోనే ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ధరించాలి. ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి. సూర్య కిరణాలు, వేడి గాలులు తగలకుండా జాగ్రత్త పాటించాలి. రోడ్లపై చల్లని, రంగు పానీయాలను తాగకూడదు. మాంసాహారాన్ని ... మిగతా 6వ పేజీలో

పాఠశాలల్లో గుడ్డు బంద్



- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారానికి ఐదు రోజులు గుడ్డు ఎప్పటినుంచో సరఫరా
- నాలుగు నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఒకటో తేదీ నుంచి నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ప్రభుత్వ తీరుపై తల్లిదండ్రులు రుసరుస
- చిక్కీల సరఫరాదారుడికి భారీగా బకాయిలు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి గుడ్లు సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం నాలుగు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ సరఫరాను ఆపేశారు.

విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 583 పాఠశాలల్లో 79,627 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లాలో 1,424 పాఠశాలల్లో 1,07,066 మంది విద్యార్థులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,600 పాఠశాలల్లో 98 వేల మంది చదువుకుంటున్నారు. ప్రతి విద్యార్థికి వారానికి ఐదు రోజులు (శని, ఆదివారం తప్ప) మధ్యాహ్నం భోజనంలో ఉడకబెట్టిన గుడ్డు అందిస్తున్నారు. గుడ్ల సరఫరా కోసం జిల్లా స్థాయిలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఖరారుచేశారు. నెలలో జాతీయ గుడ్ల సమాఖ్య (నెక్) నిర్ణయించిన రేటు సగటు ధరకు గుడ్లు సరఫరా చేయాలి. దానిపై గుడ్డుకు 70-95 పైసలు రవాణా ఖర్చు కింద చెల్లిస్తారు. టెండరు నిబంధనల మేరకు వారానికి ఒకరోజు పాఠశాలకు సరఫరా చేస్తుంటారు. సరఫరాదారులు ప్రతి నెలా బిల్లును డీఈవో కార్యాలయానికి అందజేస్తుంటారు. వాటిని పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం బిల్లులు మంజూరుచేసే గ్రీన్‌ఛానల్ ద్వారా అప్‌లోడ్ చేస్తే ఒకటి లేదా ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.15
సహరి (ఆది)	4.31



మత్స్యకారుల బోటులో మంటలు

- వార్త మెయిన్ 3లో

- తీరానికి 30 నాటికల్ మైళ్ల దూరాన ప్రమాదం
- విశాఖపట్నం తరలించిన కోస్ట్‌గార్డు
- బాధితులకు కేజీహెచ్‌లో చికిత్స

కాకినాడకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లగా వారి బోటులోని జనరేటర్ నుంచి ఆకస్మికంగా మంటలు రావడంతో పలువురు గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న కోస్టుగార్డు దళం శుక్రవారం రాత్రి వారిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువచ్చింది.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బెవర సత్యనారాయణ



బెవర సత్యనారాయణ

విశాఖపట్నం-లీగల్, ఏప్రిల్ 5: విశాఖ న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) నూతన అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ ఎన్నికయ్యారు. గురువారం ఎన్నిక నిర్వహించగా, ఫలితాలను శుక్రవారం రాత్రి ప్రకటించారు. అధ్యక్షునిగా సత్యనారాయణ తన సమీప ప్రత్యర్థిపై 995 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అలాగే సంఘ ప్రధాన కార్యదర్శిగా డి.నరేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా అడపా సుధాకర్, కోశాధికారిగా అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. ఇంకా గ్రంథాలయ కార్యదర్శిగా కర్రి మాదవీలత, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా సింహాద్రియాదవ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా ఆడారి అప్పారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి సంబంధించి రీకౌంటింగ్ జరపాలని డిమాండ్ రావడంతో ఫలితం ప్రకటించలేదు. కాగా, న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ఇతర న్యాయమూర్తులు అభినందించారు. ఈ సందర్భంగా ... మిగతా 6వ పేజీలో



నూకాంబికకు సారె సమర్పణ


గజమాలలో అమ్మవారు

మురళీనగర్, ఏప్రిల్ 5 ; బర్మాక్యాంప్ శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరోరోజు అమ్మవారికిఉదయం నూతన వస్త్రాలతో అలంకరించి, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి చిట్టిబాబు శర్మ, సహాయకులు భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. గ్రామస్థులు అమ్మవారికి ఈ సందర్భంగా సారె సమర్పించుకున్నారు. పలు రకాల స్వీట్లు, పండ్లు, పూలతో ఆలయం ప్రాంగణంలో దేవీ మండపం ఎదుట సారె కొలువుదీర్చారు. రోజంతా మాలధారణ భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈనెల 8వ తేదీన కొత్త అమావాస్య ప్రధాన జాతర నిర్వహించనున్నారు.


భక్తులు అమ్మవారికి సమర్పించిన సారె

పాఠశాలలో ఇఫ్తార్ విందు


సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 5 : తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాలలో ముస్లిం విద్యార్థులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు, హఫీజ్ సాహెబ్, రఫీ, ఇషాన్ సాహెబ్ పాల్గొన్నారు.

'పరదేశి యాదవ్‌కు కో ఆర్డినేటర్ పదవి కేటాయించలేదు'

విశాఖపట్నం, ఏప్రిల్ 5: దక్షిణ నియోజకవర్గంలోనున్న క్లస్టర్ ఇన్‌చార్జిల కోఆర్డినేటర్‌గా బొట్టా పరదేశి యాదవ్‌ను నియమించినట్టు పార్టీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శినుంచి ఎటువంటి ఆదేశాలు తమకు రాలేదని పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండిబాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. పరదేశి యాదవ్‌కు పదవి కేటాయించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ధ్రువీకరించలేదన్నారు. అందువల్ల పరదేశి యాదవ్ పదవి రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

▸ టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్


జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీభరత్, నాయకులు

మహారాణిపేట, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం శ్రీ భరత్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బాబూజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీ భరత్... బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, పొడుగుకుమార్, వానపల్లి గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల నేత

మహారాణిపేట, ఏప్రిల్ 5: అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో రెల్లివీధిలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంబేడ్కర్ సొసైటీ కార్యదర్శి జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను అం దరూ మననం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు రెల్లివీధుల సంఘం అధ్య క్షుడు సింగంపల్లి కళ్యాణముని, కస్తూరి వెంకటరావు, క్రీడాకారుడు నందు, మాడుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్; విశాఖపట్నం ఉప రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీసీ రాజారత్నం జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయానను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఆయనపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్ ద్వారా జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాల్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు, రామ్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది హాజరయ్యారు.


నివాళులర్పిస్తున్న డిటిసి రాజరత్నం, కార్యాలయ సిబ్బంది


బాబూజీకి నివాళర్పిస్తున్న డీఈవో చంద్రకళ, ఉపాధ్యాయులు

సీతమ్మధార: వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైసీపీ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, అళ్ల లీలావతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: జగ్జీవన్ రామ్ జీవితాన్ని అణగారిన వర్గాలకు అంకితం చేసిన గొప్ప నేత అని డీఈవో చంద్రకళ అన్నారు. శుక్రవారం స్థానిక జూబ్లిస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూల్యంకన కేం ద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాబూజీ ఆశయ సాధనకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ క్యాంప్ అఫీసర్ మాణిక్యం నాయుడు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, జిల్లా కామన్ బోర్డు కార్యదర్శికృష్ణకుమార్, ఏసీఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచరపాలెం: బాబూ జగ్జీవన్‌రామ్ కు కప్పరాడలో వైసీపీ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని పూలమాలలు ఘటించారు. వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి,స్థానికులు పాల్గొన్నారు.


షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం


ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం

ఆధ్యాత్మిక సౌరభం.. అన్నదాన నిలయం

▸ 14 ఏళ్లుగా రైల్వేన్యూకాలనీ షిర్డీ సాయి మందిరంలో నిత్యాన్నదానం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 5: అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్ప పుణ్య కార్యమని లోకోక్తి. ఈ హితోక్తులను రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో కమిటీ అక్షరాల పాటిస్తూ ఎంతో మంది నిర్భాగ్యుల ఆకలితీర్చితోంది. గత 14 ఏళ్లుగా నిర్విరామంగా ఈ సేవా కార్య క్రమాలను కొనసాగిస్తోంది. అలాగే, అటు ఆధ్యాత్మికంగా, ఇటు సేవాపరంగా ఈ మందిరం దినదినాభివృద్ధి చెందుతూ విరాజిల్లుతోంది. భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. 2010 మార్చి 16వ తేదీ ఉగాది పర్వదినాన ధ్యానమందిరంలో భక్తులు పేదల కోసం అన్నసమారాధానను ప్రారంభించారు. తొలుతలో కేవలం గురువారాలల్లో మాత్రమే అన్నదానం చేసేవారు. నాడు కేవలం పది మందితో ప్రారంభమై.. నేడు నిత్యాన్నదానంగా మారి ప్రతి రోజూ సుమారు 100 మందికి, గురువారాల్లో సుమారు 200 మందికి అన్నదానం చేస్తున్నస్థాయికి ఎదిగింది. ఏ సమయంలోనైనా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ సహకారంతో 24 గంటలూ తాజా ఆహారాన్ని అందించేందుకు రెండు కమ్యూనిటీ ఫ్రిజ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో కొంత ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరచి ఈ ఫ్రిజ్‌ల్లో ఉంచడం వల్ల అవసరం ఉన్న వారు ఏ సమయంలోనైనా వీటిలో నుంచి తీసుకుని వారి ఆకలి తీర్చుకుంటున్నారు. ఇలా ఎన్నో విశిష్టతలు కలిగిన ఈ ధ్యానమందిరంలో ప్రత్యేక పర్వదినాల్లో పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


మందిరంలో కొలువైన బాబా

ఉగాది, శ్రీరామనవమిలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఈ నెల 9వ తేదీన ఉగాది రోజున 15వ వసంతంలోకి షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం అడుగుపెట్టనుంది. ఉగాది, శ్రీరామనవమి పండగలను పురస్కరించుకొని ధ్యానమందిరంలో పలు పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

భక్తులు, దాతల సహకారంతో సేవలు



భక్తులు, దాతల సహకారంతో గత 14 ఏళ్లనుంచి నిర్విరామంగా అన్నదానం కొనసాగిస్తున్నాం. కరోనా సమయంలోనూ ప్యాకెట్ల రూపంలో ఆహారం అందజేశాం. మాలలు ధరించిన స్వాములకు గతేడాది నుంచి 60 రోజుల పాటు ప్రత్యేక అన్నదానం నిర్వహించాం. కమ్యూనిటీ ఫ్రిజ్‌ల ద్వారా ఏ సమయంలోనైనా పేదలు, అన్నార్తుల ఆకలిని తీర్చగలుగుతున్నాం.

-నూకల శేషగిరిరావు,
ధ్యానమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు

విశాఖను డ్రగ్స్ సిటీగా మార్చేశారు

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 5: విశాఖను డ్రగ్స్ సిటీగా మార్చేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ విమర్శించారు. శుక్రవారం రైల్వేన్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ సరఫరా చేసింది మీరంటే మీరు అని టీడీపీ, వైసీపీ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయన్నారు. రాష్ట్ర రాజధానిగా విశాఖ ను చేస్తానన్న హామీ అమలుకాలేదన్నారు. రాజధాని కోసమంటూ రుషికొండ లో కొండ మాయం చేశారని ఎద్దేవా చేశారు. తాను విశాఖ వాసి నేనని ఆయన గుర్తు చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఉత్తమ పర్యాటక నగరంగా విశాఖను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటానన్నారు. స్టీల్‌ప్లాంట్ విలువ రూ.8 లక్షల కోట్లు అయితే రూ. 8వేల కోట్లకు వి క్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి పరి శ్రమకుచెందిన 33 వేల ఎకరాల్లో 19,200 ఎకరాలు మాత్రమే మిగిలాయన్నారు. ఇంకా ప్లాంట్‌లో 8,500 ఉద్యోగాలు భర్తీ చేయలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ రూ.8 లక్షల కోట్లు నష్టాల్లో ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యేసుపాదం, జిలుకర రవికుమార్ పాల్గొన్నారు.

పాతకక్షలతో యువకుడిపై కత్తితో దాడి


సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

మద్రిపాలెం, ఏప్రిల్ 5: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధి అర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని అంబేడ్కర్ కాలనీలో స్థానికులు కొందరు ఆ ప్రాంతంలో ఉంటున్న యువకుడి పై మూకుమ్మడి దాడికి పాల్పడటంతో కత్తి పోట్లకు లోనుచేశారు. గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గురువారం సాయంత్రం అంబేడ్కర్ కాలనీలో సంత జరుగుతుండగా కల్లిపిల్లి ఏసురత్నం వద్దకు కాలనీకి చెందిన ఉదయ్ కుమార్, రాజ్‌కుమార్, జగదీష్, సన్యాసిరావు, కార్తీక్, శివశంకర్, వచ్చి మీ కుమారుడు అభిషేక్‌ను చంపేస్తామని బెదిరిం చారు. దీంతో ఆమె తన చెల్లి అయిన కుప్పిరాల మరియకు చెప్పింది. ఈలోగా విధులు ముగించుకొని వచ్చిన అభిషేక్‌పై పైన పేర్కొన్న యువకులు దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్నమరియ చిన్నకొడుకు తేజ (మూగ, చెవిటి వ్యక్తి), పెద్దకొడుకు దావీదులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఇంతలో దాడికి పాల్పడిన వారిలో ఒకరైన జగదీష్ కత్తితో తేజను కడుపులో పొడవగా తీవ్ర గాయమైంది. తేజాను పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చిన స్థానికులు జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు రాత్రి సమయంలో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన ము గ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న తేజ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అధ్వర్యంలో ఘటన జరిగిన ప్రాంతంలో ప్రత్యేక బలగాలు కాపలా కా స్తున్నాయి.ఇప్పటివరకు ఈకేసులో ప్రమేయం ఉన్న ఆరుగురిని అదపులోకి తీసుకుని విచారి స్తున్నారు. తేజ తల్లి ఫిర్యాదు మేరకుసీఐ చక్రధర్‌రావు నేతృత్వంలో కేసు నమోదు చేసి ఎస్సై రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

7న విశాఖ కళాకారుల ఉగాది వేడుకలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 5: విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉగాది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు జనార్దన్ మాట్లాడుతూ, ఆరోజు జబర్దస్త్ ఆర్టిస్టు రాపేటి అప్పారావు, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని గోక డింపుల్, ప్రముఖ కుచిపూడి నృత్య దర్శకుడు టి.సందీప్, పల్సర్ బైక్ ఝాన్సీ, సినీ కొరియోగ్రాఫర్ సీహెచ్ రమేష్‌మాస్టర్, పౌరాణిక నాటకాల నటుడు యడ్ల గోపాలరావు, భాగవతార్, ఇతేషసాయి, రమేష్ పట్నాయక్, పీవీ శివప్రసాద్ తదితరులకు ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్నామన్నారు. సమావేశంలో బ్రహ్మకుమారీస్ రామేశ్వరీ, గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజు పట్నాయక్, శివజ్యోతి, మోహర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'అవినీతి నిర్మూలనే జై భారత్ పార్టీ లక్ష్యం'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 5: అవినీతి నిర్మూలనే లక్ష్యంగా జై భారత్ నేషనల్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమైందని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్ కన్నేపల్లి మహదేవ్ కల్యాణ్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉచిత విద్య, అభివృద్ధి దిశగా తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుల ధ్యేయమన్నారు. సమావేశంలో పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి ఆదారి శరత్‌చంద్ర, పెందుర్తి ఇన్‌చార్జి రవితేజ పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 5: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా ఎర్నాకులం-బ్రహ్మపూర్, చెన్నై ఇగ్మోర్-సంత్రాగచ్చి మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ మధ్య రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06087 నంబరు గల రైలు ఈనెల ఆరు నుంచి మే 25వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మ ర్నాడు ఉదయం 5.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల ఎనిమిది నుం చి మే 27 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12.40 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరిసాయంత్రం 6.05 దువ్వాడ, మర్నాడు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

06077 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 11.00 గం టలకు చెన్నై ఇగ్మోర్‌లో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడ, మర్నాడు (సోమవారం) ఉదయం 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 1.48 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై ఇగ్మోర్ చేరుతుంది.

06073 నంబరు రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు ఈనెల ఆరు నుంచి జూన్ మూడు వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ, సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరిగి ఈనెల ఏడు నుంచి జూన్ నాలుగు వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.42 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.00 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

'దక్షిణ' లోఓటర్లకు తాయిలాల పంపిణీకి యత్నాలు?

జగదాంబ కూడలి, ఏప్రిల్ 5: దక్షిణ వైసీపీ నాయకులు ఓటర్లకు ఇప్పటి నుంచే తాయిలాల పంపకాలకు తెరతీస్తున్నారు. వైసీపీ తరఫున ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఈ నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్నారు. ఈనేపథ్యంలో వార్డు స్థాయిల్లో బీసీ కులాలు, యువజన సంఘాలతోపాటు ముస్లిం ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకుప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల ప్రచారం ఒకవైపు చేస్తూ.. మరోవైపు ఆయా వార్డులో బలమైన బీసీ వర్గాలు, మైనార్టీల వర్గాలతో రహస్య మంతనాలు జరుపుతున్నారు. వాసుపల్లికి ఓటు వేయాలని, అందుకు ప్రతిఫలం చూపుతామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు సమాచారం. శుక్రవారం వార్డులో వైసీపీ అనుయాయులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈనేపథ్యంలో వార్డులోని ముస్లింలు, బీసీ కులవర్గీయులున్న కుమ్మరవీధి, జెండాచెట్టు ప్రాంతాల్లో వాసుపల్లి అనుచరగణం పలు ఆశలు చూపుతూ ప్రలోభాలకు పాల్పడినట్టు సమాచారం. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

విశాఖపట్నం, ఏప్రిల్ 5: విశాఖ రైల్వే స్టేషన్‌లో యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాలివి.. తూర్పుగోదావరి, తొండంగి గ్రామానికి చెందిన యువతి ఈనెల నాల్గో తేదీన ఇంట్లో చెప్పకుండా విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరి నట్టు బంధువు ద్వారా సమచారం అందుకున్న యువతి తండ్రి, ఇక్కడికి చేరుకుని వెతికినా కనిపించలేదు. దీంతో తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఆచూకీ తెలిసినవారు జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజనాయుడు ఫోన్:94406 27547, ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు ఫోన్:9866 413487లకు సమాచారమివాలన్నారు.

ఎన్నికల్లో పారదర్శకంగా ఉండాలి: ఆర్‌వో

సీతమ్మధార, ఏప్రిల్ 5: పీడబ్ల్యూడీ ఓటర్లు, 85 ఏళ్ల పైబడిన వారి వివరాలు సేకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.అఖిల కోరారు. సీతమ్మధార తహశీల్దార్ జి.రామ్మూర్తి సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు, ఎన్నికల సూపర్‌వైజర్లతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలకు అవగాహనకల్పించాలని కోరారు.

పాఠశాలల్లో గుడ్డు బంద్

... 5వ పేజీ తరువాయి

రెండు నెలల వ్యవధిలో సొమ్ములు అవుతుంటాయి. అయితే నాలుగు నెలలకుపైబడి బిల్లులు అందకపోవడంతో సరఫరాదారులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు భరోసా ఇచ్చినా ఇప్పటివరకూ విడుదల కాలేదు. దీంతో గుడ్ల సరఫరా నిలిపివేయాలని సరఫరాదారులు నిర్ణయించారు. దాదాపు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో గుడ్ల సరఫరా ఆపేశారు. జిల్లాలో ఈనెల ఒకటో తేదీ నుంచి గుడ్ల సరఫరా నిలిపివే శారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే గుడ్ల సరఫరా కావడం లేదని టీచర్లు చెబుతున్నారు. కాగా, వారానికి మూడు రోజులు చిక్కీలు ఇస్తుంటారు. వాటి సరఫ రాదారుడికి కూడా బిల్లులు చెల్లించడం లేదు. అయితే చిక్కీలు తయారుచేసే కాంట్రాక్టర్ ప్రస్తుతం తన వద్ద సరకు ఉన్నంత మేరకు పాఠశాలలకు సరఫరా చేసి తరువాత పంపిణీకి స్వస్తి చెప్పాలని నిర్ణయించారు. పాఠశాలల్లో గుడ్ల సరఫరా నిలిపివేయడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పిల్లలకు ఇచ్చే గుడ్లకు ప్రభుత్వం వద్ద పైసలు లేవా అంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుడ్ల సరఫరాదారులకు రూ.150 కోట్ల వరకు బకాయి ఉన్నట్టు తెలిసింది.

మండిన విశాఖ

... 5వ పేజీ తరువాయి

తగ్గించాలి. మద్యం తాగకుండా ఉండడం మేలు. ఎండవేళ శరీరంపై భారం పడే పనులకు దూరంగా దూరంగా ఉండాలి.

60 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా

ఆరోగ్య శాఖ ఒకపక్క ప్రజలకు అవగాహన కల్పిస్తూనే.మరోపక్క ఎండ దెబ్బతిన్న వాళ్ల రీహైడ్రేట్ అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఓఆర్‌టీ (ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ) కార్నర్స్ ఏర్పాటుచేస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, అంగన్‌వాడీ సెంటర్లు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ఈ ఓఆర్‌టీ కార్నర్స్‌ను ఏర్పాటుచేయనున్నారు. ఈ కార్నర్స్‌లో ఆరోగ్య శాఖకు చెందిన సిబ్బంది ఒకరు ఉంటారు. అక్కడ ప్రత్యేకంగా ఓఆర్ఎస్ ద్రావణం, వడదెబ్బ తగిలిన వారికి అందించాల్సిన ప్రాథమిక వైద్యానికి సంబంధించిన మందులు ఉంటాయి. ఇందుకోసం 60 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేసినట్టు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. మరో ఆరు లక్షల ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని, ఎండ తీవ్రత కొనసాగినంత కాలం కార్నర్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

వడదెబ్బ తగిలితే...

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకువెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ఇలా చేస్తుండాలి. ఫ్యాన్ గాలి, చల్లని గాలి తగిలేలా చర్యలు చేపట్టాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజు ద్రావణం, ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) ఇవ్వాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బెవర సత్యనారాయణ

... 5వ పేజీ తరువాయి

సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా పనిచేస్తామన్నారు.

రౌడీషీటర్ల వద్ద తుపాకులు

... 5వ పేజీ తరువాయి

బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు అతడి వద్ద నుంచి పిస్టల్‌తోపాటు రెండు బుల్లెట్‌లను సాధీనం చేసుకున్నారు. ఆ తరువాత రెండు రోజులకే రామాటాకీస్ సమీపంలోని ఒక ప్రైవేటు ట్రావెల్స్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి నుంచి ఒక పిస్టల్, రివాల్వర్‌తోపాటు రెండు బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల కిందట ఆరిలోవ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ కిట్టూ నుంచి ఒక పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతానికి ముగ్గురు నుంచి తుపాకీలు బయటపడినప్పటికీ మరికొందరు రౌడీషీటర్లు, ఆకతాయిల వద్ద కూడా ఇలాంటి తుపాకీలు, రివాల్వర్లు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. భవిష్యత్తులో ఏదో ఒకరోజు బెదిరింపులు, సెటిల్‌మెంట్ల సమయంలో వీటిని బయటకు తీసే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలో మాదిరిగా రౌడీషీటర్ల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటుచేసినట్టయితే వారి ఆగడాలకు ముకుతాడు వేయడంతోపాటు వారి వద్ద ఉన్న లైసెన్స్ లేని ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకోవచ్చునని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

అంగన్‌వాడీల ఆశలు వమ్ము

... 5వ పేజీ తరువాయి

చెల్లించాలి. కానీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి ఉన్నారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పని భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో గత ఏడాది డిసెంబరు నుంచి సుమారు 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెతో ఇబ్బంది కలుగుతోందని భావించిన ప్రభుత్వం...సంఘ నాయకులతో చర్చలు జరిపింది. ఈ డిమాండ్లను అమలు చేయడానికి అంగీకరించింది. అయితే, వీటిలో రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు సంబంధించి జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మె కాలానికి సంబంధించిన పూర్తి వేతనాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ వేతనాన్ని కూడా ఇప్పటివరకూ విడుదల చేయలేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికీ కమిటీని ఏర్పాటు చేయలేదని, తమను నమ్మించి ఈ ప్రభుత్వం మోసం చేసిందంటూ అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షు రాలు మణి ఆరోపించారు. అంగన్‌వాడీలను జగన్ మోసం చేశారని, ఎన్నికల సమ యంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయారని అనకాపల్లి ప్రాం తంలో పని చేస్తున్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తంచేశారు. సమ్మె సమ యంలో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు...ఒక్క డిమాండ్‌ను మాత్రమే నెరవేర్చే దిశగా చర్యలు తీసుకున్నారని విశాఖ నగర పరిధిలో పనిచేస్తున్న మరో అంగన్‌వాడీ ఉద్యోగి వాపోయారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లో ఉందని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

శ్రీవారికి ఏకాదశి పూజలు


అలంకరణలో శ్రీవారు, రామానుజుల స్వామి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 5: జీవీఎంసీ 87వ వార్డు రాజులపాలెం శ్రీదేవి-భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి ఆలయంలో శుక్రవారం ఏకాదశిని పురస్కరించుకొని అర్చకులు కోగంటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీ రామానుజుల స్వామివారు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం భక్తులు ఆలపించారు. ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రామ నామం సర్వజన హితం

పెందుర్తిరూరల్, ఏప్రిల్ 5: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా చింతలఅగ్రహారం కాలనీ గోపాలకృష్ణ ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త నిట్టల బాపూరావు రామాయణం విశేషాలు వివరించారు. ప్రవచన కార్యక్రమం శనివారం వరకు జరుగుతుందని ఆలయ ధర్మకర్త ఆళ్ళ తాతారావు తెలిపారు. అర్చకులు మూర్తి హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెంకన్నకు పంచామృతాభిషేకాలు

పెందుర్తి, ఏప్రిల్ 5: స్థానిక వెంకటాద్రి శిఖరం పైనున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్టు విగ్రహానికి పసుపు, పాలు, నెయ్యి, పంచదార, పెరుగు, నారికేళం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరుడికి గజమాలతో ప్రత్యేక అలంకరించారు. అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

'పోరాటాలతో కేంద్రం దిగిరావాలి'


రిలే దీక్షలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 5: ఉక్కు కార్మికుల పోరాటాలతో కేంద్ర ప్రభుత్వం దిగిరావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామచంద్రరావు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 1149వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉద్యోగుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలు ఛీత్కరిస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కక్ష్య సాధింపులతో ప్రభుత్వాలు విచ్చలవిడితనాన్ని ప్రదర్శిస్తే, ప్రజలు తగు సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తుల చేతిల్లో కీలుబొమ్మగా మారారన్నారు. గతంలో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అభివృద్ధి జరిగితే, నేడు ప్రభుత్వ రంగాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'త్రిఫ్ట్ సొసైటీపై దుష్ప్రచారం'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 5: రూ. 390కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ నెంబర్ 1గా నిలిచిందని సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ తెలిపారు. అయితే, ఇటీవల సామాజిక మాధ్యమాల్లో సొసైటీ డిపాజిట్స్ తిరిగి ఇవ్వలేని పరిస్థితిలో ఉందని తప్పుడు ప్రచారాలు జరిగాయని, ఇలాంటి వాటిని సభ్యులు నమ్మవద్దని కోరారు. తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 25, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 24, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది)6, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబాటి 24, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 32, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 42, ఆగాకర 52, పొటల్స్ 48, కీరదోస 24, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు


బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

లీకులతో వృథా... తాగునీటికి వ్యధ


ఆటోనగర్ బీ బ్లాక్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


బిలా కార్యాలయం సమీపంలో...


ఎంఎస్ఎంఈ కార్యాలయం రోడ్డులో ఇలా...

ఆటోనగర్, ఏప్రిల్ 5: ఆటోనగర్‌లో పలు బ్లాకులలో పైపులైన్ లీకులతో తాగు నీరు వృథాగా పోవడంతో నిత్య కృత్యంగా మారింది. దీనికి తోడు నీరు నిలిచి రహదారులపై గోతులుపడిపోతున్నాయి. వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అలాగే, కొద్దిరోజులుగా పలుచోట్ల నీరు నేలపాలవుతున్నా జీవీఎంసీ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. నియోజక వర్గంలోని పలు ప్రాంతాలకు మునిసిపల్ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీటి సరఫరాలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు మాత్రం నిర్లక్ష్యం వల్ల పైప్‌లైన్ లీక్‌లతో కాలువలలో తాగునీటిని వృథాగా పోతోంది. వాస్తవానికి జీవీఎంసీ నీటి విభాగం సిబ్బంది వార్డు పరిధిలో పర్యటిస్తూ పైప్‌లైన్ లీకులను అరికట్టాలి. కానీ, వారు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తాగునీటి వృథాను నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

పైప్‌లైన్ లీకులతో ఆటోనగర్‌లో పలు రహదారులపై గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. ఈ గుంతలువద్ద రాళ్లు తేలిపోయాయి. దీంతో పలువురు ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఇటీవలే ఈ రహదారుల గోతుల్లో పడి పలువురు మృత్యువాత పడ్డారు. ఇకనైనా మరమ్మతులు చేపట్టాలని స్థానిక కాలనీ వాసులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.


ఆటో యూనియన్ సభ్యులతో ఆడారి ఆనంద్ కుమార్


ఆనంద్ తరపున ప్రచారం చేస్తున్న వైఎస్ఆర్‌యూసీ నేత బద్రీనాథ్

వాహన మిత్ర పథకంతో ఆటోవాలాలకు మేలు

పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 5: వైసీపీ ప్రభుత్వం అందించిన వాహన మిత్ర పథకం ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకుందని పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. కుమారి కల్యాణ మండపంలో 89, 92, 91 వార్డుల ఆటో యూనియన్ సభ్యులతో శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బెహరా భాస్కరరావు, పేడాడ రమణికుమారి, కార్పొరేటర్‌లు, పాల్గొన్నారు.

61వ వార్డులో వైసీపీ ఎన్నికల ప్రచారం

మల్కాపురం: గ్రేటర్ 61వ వార్డులో పశ్చిమ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ వైఎస్ఆర్‌టీయూ ఉత్త రాంధ్ర జిల్లాల కో - ఆర్డినేటర్ కలిదండి బద్రీనాద్, కార్పొరేటర్ కొణతాల సుధ శుక్రవారం ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

గోపాలపట్నం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని లక్ష్మీనగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడుగా, సంఘ సంస్కర్తగా బాబూజీ సేవలు చిరస్మరణీయమన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

ప్రధాన బస్టాప్‌లలో ఆటోవాలాల ఇష్టారాజ్యం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు శూన్యం


పాతగాజువాక బస్టాప్‌లో నిలిపిఉంచిన ఆటోలు

గాజువాక, ఏప్రిల్ 5: పారిశ్రామిక ప్రాంత ప్రధాన బస్టాప్‌ల్లో ఆటోలు నిలిపివేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోంది. ప్రయాణికులపై ఒత్తిడిచేసి మరీ ఆటోల్లో తీసుకువెళ్తున్నారు. బస్టాప్‌ల్లోకి ఆటోలను అనుమతించకుండా పర్యవేక్షించాల్సిన ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా పాతగాజువాక నుంచి కొత్తగాజువాక జంక్షన్ మధ్య ఉన్న బస్టాప్‌ల వద్ద ఈ పరిస్థితి ఉంది. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికుల వద్దకే ఆటోలు నేరుగా తీసుకువెళ్లి ఎక్కిస్తున్నారు. ప్రతి బస్టాప్‌ల్లోనే ఆరుఏడుకు పైగా ఆటోలు నిలపడంతో బస్సులు నిలిపేందుకు ఇబ్బందిగా ఉంటోందని బస్సు డ్రైవర్లు వాపోతున్నారు. బస్టాప్‌ల్లోకి బస్సులు కాకుండా ఇతర ప్రైవేట్ వాహనాలు రాకుండా పర్యవేక్షించే నిమిత్తం ఆర్టీసీ యాజమాన్యం ఓ హోంగార్డుతో పాటు సిబ్బందిని నియమించింది. అయితే, ఈ సిబ్బంది విధులను పూర్తి స్థాయిలో నిర్వహించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే, బస్టాప్‌ల వద్ద ఆటోలతో నిండిపోవటంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఎదురవుతోంది. రెండు రోజుల క్రితం పాతగాజువాక జంక్షన్ బస్టాప్ వద్ద ఓ ఆటోను సడన్‌గా నిలిపివేయటంతో వెనక నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొని గాయాలపాలయ్యాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణకు దారితీసింది. ఇలాంటి వివాదాలు గాజువాక ప్రాంతంలో చోటుచేసుకుంటున్నాయి.బస్టాప్‌ల్లోకి ఆటోలు అనుమతించకుండా చర్యలు చేపట్టాలని పలువురు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఆటోలు రాకుండా పర్యవేక్షణ సిబ్బందిని కట్టుదిట్టం చేయాలన్నారు. నిబంధనలు పాటించని ఆటోల డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

మురుగు సమస్య పరిష్కరించలేదని ఆందోళన


కాలువ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న స్థానికులు


సమస్యకు కారణమైన మురుగు కాలువ

ఆటోనగర్, ఏప్రిల్ 5: జీవీఎంసీ 70వ వార్డు టీవీఎస్ కాలనీని ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువతో కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు, కాలనీ వాసులు టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మురుగునీటి కాలువ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.. సజావుగా వెళ్తున్న కాలువను ఓ ప్రైవేట్ స్థల యజమాని మూసివేశారన్నారు. దీంతో కాలనీలో రహదారులను, ఇళ్లను మురుగునీరు ముంచెత్తుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. దుర్గంధంతోపాటు విష పురుగులు ఇళ్లల్లోకి చొరబడడంతో వృద్ధులు, చిన్నారులు రోగాల బారిన పడుతునానరని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు వినతి పత్రాలందిస్తున్నా ఫలితం లేకుండా పోతుందన్నారు. అధి కారులు వచ్చి పరిశీలించి హామీ ఇవ్వడం మళ్లీ పట్టించుకోకపోవడం షరామామూలైందని ఆరోపించారు. ఇకనైనా స మస్య పరిష్కారానికి అధికారులు స్పందించకుంటే కాలనీ వాసులందరితో కలసి జీవీఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన తలపెడతామని హెచ్చరించారు. స్థానిక కాలనీ వాసులు పి.మహాలక్ష్మి నాయుడు, అప్పారావు, రామారావు, రూపా జ్యోతి, వరలక్ష్మి, కృష్ణవేణి, వరహాలు, వెంకయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 5: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఉక్కు జీఎం (మిల్స్) ఎంఎస్ ప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య, ప్రతినిధులు వై. మస్తానప్ప, వైటి.దాసు. సత్యనారాయణ, రత్నం పాల్గొన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పాల్గొని జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


ఉక్కులో నివాళులర్పిస్తున్న జీఎం (మిల్స్) ప్రసాద్

మల్కాపురం: మల్కాపురం సిద్ధార్థ స్ట్రీట్‌లోని రామ్ రాంజీ సంక్షేమ సంఘం వద్ద తొలుత గౌతమ్ బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనంతరం జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు కాకరపోలారావు, ముప్పిడి నాగరాజు, కాకర రమణ, ముప్పిడి వెంకటగిరి, కాకర గోవిందరాజు, పెద్దాడ హరికృష్ణ నివాళులర్పించారు. 61వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కొణతాల సుధ, నాయకులు కలిదండి బద్రీనాద్ తదితరులు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కాకిపోలిరెడ్డి, మజ్జిమాలినాయుడు, కె.రాము నివాళులర్పించారు. ప్రకాశ్‌నగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద అరుంధతి సంఘం ప్రతినిధుల జగ్గజీవన్‌రామ్‌కి నివాళులర్పించారు. ములగాడలో జామవా సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మల్కాపురం గ్రామ మండలి, ప్రకాశనగర్, క్రాంతినగర్ లలో జగ్జీవన్‌రామ్‌కు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు అత్తిలి విమల, సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, నాయకులు గుడాల రాంబాబు నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వవార్డు ఉడాఫేజ్-1లో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని దళిత సంఘాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సంఘ ప్రతినిధులు మాటూరి శ్రీనివాసరావు, గాలి ఆనంద్ నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, మెడికల్ బాబు, శ్రీనివాస పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన ఘనత బాబూ జగ్జీవన్‌రామ్‌కే దక్కిందని బెల్ హెచ్‌పీవీపీ జనరల్ మేనేజర్ సి.గౌరీశంకర్ అన్నారు. బెల్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్‌కు ఆయన నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


బెల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం

కూటమి అభ్యర్థులను గెలిపించండి

- పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు


నాగేంద్రకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 5: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహపడాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పిలుపునిచ్చారు. గ్రేటర్ 89వ వార్డు నాగేంద్రకాలనీలో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, బొడ్డేటి విజయ్ కుమార్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే ప్రజా సంక్షేమం: పల్లా


74వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, బీజేపీ, జనసేన నేతలు

గాజువాక, ఏప్రిల్ 5: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి వియ్యపు కొండబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గ పాలన నుంచి మరికొన్ని రోజుల్లోనే విముక్తి కలుగుతుందన్నారు. అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్న జగన్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు జాబుల గంగరాజు, దువ్వి శ్రీను, చిన్నోడు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పాలి...

అగనంపూడి: ఐదేళ్ల పాలనతో అవినీతి తప్ప అభివృద్ధికి చోటు లేని వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. 79వ వార్డు పరిధి పాతఅగనంపూడి రామాలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచారం చేశారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు ఒక్కటయ్యాయన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గాజువాక నియోజవర్గంలో అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కేఎస్ఎన్ రెడ్డి నగర్, గల్లావానిపాలెం, శనివాడ, అన్నపూర్ణనగర్, ఇస్పాత్‌నగర్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, కర్రి దోశేంద్ర, కరణం సత్యారావు, చిత్తా కనకరాజు, మేడిశెట్టి విజయ్, కరణం జగదీశ్, సూర్య, కనకభవానీ, సింగిడి సింహాచలం, గుర్రం నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో పంచకర్ల ప్రచారం


పెందుర్తిలో ప్రచారం చేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఏప్రిల్ 5: జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం పెందుర్తిలో విస్తృతంగా ప్రచారాన్ని చేశారు. ఉదయం స్థానిక కళశాల వద్ద వాకింగ్ ట్రాక్ వాకర్స్‌తో పంచకర్ల మాట్లాడారు. ఉమ్మడి కూటమి అభ్యర్థిగా ఉన్న తన గెలుపునకు సహకరించాలని కోరారు. పెందుర్తి ప్రాం తంలో గల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, పరిష్కారం చేస్తానన్నారు. పారిశుధ్య కార్మికులను కలసి అన్ని రంగాలను నిర్వీర్యం చేసిన వైసీపీకి ప్రజలు ఓటు తో బుద్ధి చెప్పాలని కోరారు. పంచకర్ల వెంట అయిత సింహాచలం పాల్గొన్నారు.

ఫ్లైవోవర్ కింద నిత్యం ట్రాఫిక్ జామ్

- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు


ఫ్లైవోవర్ కింద రోడ్డుపైనే నిలిపి ఉంచిన ఆటోలు

ఎన్ఏడీ జంక్షన్, ఏప్రిల్ 5: ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కూడలిలో రహదారిపైనే వరుసగా ఆటోలు నిలుపుదల చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రివేళల్లో అధిక సంఖ్యలో ఇలా నిలిపి ఉంచేస్తుండడం, వంతుల వారీగా ప్రయాణికుల కోసం వేచి చూడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరికొందరు రోడ్డుపైనే ఆటోలను నిలిపేసి, ఇతర పనులకు వెళ్లిపోతున్నారు. దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు కనీసం దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. మర్రిపాలెం, గాజువాక, గోపాలపట్నం వెళ్లే మలుపు మార్గంలోనే ఆటోలు నిలుపుదల చేస్తుండడంతో కనీసం నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఫ్లైవోవర్ కింద ఆటోవాలల హవాను నియంత్రించాలని, రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు


కొత్తపాలెం నూరానియా మసీదులో ఇఫ్తార్ విందు

గోపాలపట్నం, ఏప్రిల్ 5: రంజాన్ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా గోపాలపట్నంలోని తాహా మసీదు, కొత్తపాలెంలోని నూరానియా మసీదు, నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతిరోజు ఐదు వేళల ఆచరించే నమాజులతో పాటు రంజాన్‌లో రాత్రి వేళలో ఆచరించే తరావీ నమాజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. రంజాన్ ఆఖరి పది రోజుల్లో షబె ఖదర్ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

నూకాంబికకు సారె సమర్పణ



గజమాలలో అమ్మవారు

మురళీనగర్, ఏప్రిల్ 5 ; బర్మాక్యాంప్ శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరోరోజు అమ్మవారికిఉదయం నూతన వస్త్రాలతో అలంకరించి, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి చిట్టిబాబు శర్మ, సహాయకులు భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. గ్రామస్థులు అమ్మవారికి ఈ సందర్భంగా సారె సమర్పించుకున్నారు. పలు రకాల స్వీట్లు, పండ్లు, పూలతో ఆలయం ప్రాంగణంలో దేవీ మండపం ఎదుట సారె కొలువుదీర్చారు. రోజంతా మాలధారణ భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈనెల 8వ తేదీన కొత్త అమావాస్య ప్రధాన జాతర నిర్వహించనున్నారు.



భక్తులు అమ్మవారికి సమర్పించిన సారె

పాఠశాలలో ఇఫ్తార్ విందు



సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 5 : తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాలలో ముస్లిం విద్యార్థులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు, హఫీజ్ సాహెబ్, రఫీ, ఇషాన్ సాహెబ్ పాల్గొన్నారు.

'పరదేశి యాదవ్‌కు కో ఆర్డినేటర్ పదవి కేటాయించలేదు'

విశాఖపట్నం, ఏప్రిల్ 5: దక్షిణ నియోజకవర్గంలోనున్న క్లస్టర్ ఇన్‌చార్జిల కోఆర్డినేటర్‌గా బొట్టా పరదేశి యాదవ్‌ను నియమించినట్టు పార్టీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శినుంచి ఎటువంటి ఆదేశాలు తమకు రాలేదని పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండిబాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. పరదేశి యాదవ్‌కు పదవి కేటాయించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ధ్రువీకరించలేదన్నారు. అందువల్ల పరదేశి యాదవ్ పదవి రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

» టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీభరత్, నాయకులు

మహరాణిపేట, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం శ్రీ భరత్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బాబూజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీ భరత్... బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ లర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, పొడుగుకుమార్, వానపల్లి గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల నేత

మహరాణిపేట, ఏప్రిల్ 5: అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో రెల్లివీధిలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంబేడ్కర్ సొసైటీ కార్యదర్శి జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను అం దరూ మననం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు రెల్లివీధుల సంఘం అధ్య క్షుడు సింగంపల్లి కళ్యాణముని, కస్తూరి వెంకటరావు, క్రీడాకారుడు నందు, మాడుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్; విశాఖపట్నం ఉప రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీసీ రాజారత్నం జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయానను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్‌పై ఆయనపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్ ద్వారా జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాల్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు, రామ్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది హాజరయ్యారు.



నివాళులర్పిస్తు డిటిసి రాజరత్నం, కార్యాలయ సిబ్బంది



బాబూజీకి నివాళర్పిస్తున్న డీఈవో చంద్రకళ, ఉపాధ్యాయులు

సీతమ్మధార: వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైసీపీ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ళ లీలావతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: జగ్జీవన్ రామ్ జీవితాన్ని అణగారిన వర్గాలకు అంకితం చేసిన గొప్ప నేత అని డీఈవో చంద్రకళ అన్నారు. శుక్రవారం స్థానిక జూబ్లిస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేం ద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాబూజీ ఆశయ సాధనకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ మాణిక్యం నాయుడు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, జిల్లా కామన్ బోర్డు కార్యదర్శికృష్ణకుమార్, ఏసీఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచరపాలెం: బాబూ జగ్జీవన్‌రామ్ కు కప్పరాడలో వైసీపీ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని పూలమాలలు ఘటించారు. వార్డు కార్పోరేటర్ కంటిపాము కామేశ్వరి,స్థానికులు పాల్గొన్నారు.



షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం



ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం

ఆధ్యాత్మిక సౌరభం.. అన్నదాన నిలయం

» 14 ఏళ్లుగా రైల్వేన్యూకాలనీ షిర్డీ సాయి మందిరంలో నిత్యాన్నదానం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 5: అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్ప పుణ్య కార్యమని లోకోక్తి. ఈ హితోక్తులను రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో కమిటీ అక్షరాల పాటిస్తూ ఎంతో మంది నిర్భాగ్యుల ఆకలితీర్చితోంది. గత 14 ఏళ్లుగా నిర్విరామంగా ఈ సేవా కార్య క్రమాలను కొనసాగిస్తోంది. అలాగే, అటు ఆధ్యాత్మికంగా, ఇటు సేవాపరంగా ఈ మందిరం దినదినాభివృద్ధి చెందుతూ విరాజిల్లుతోంది. భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. 2010 మార్చి 16వ తేదీ ఉగాది పర్వదినాన ధ్యానమందిరంలో భక్తులు పేదల కోసం అన్నసమారాధానను ప్రారంభించారు. తొలుతలో కేవలం గురువారాలల్లో మాత్రమే అన్నదానం చేసేవారు. నాడు కేవలం పది మందితో ప్రారంభమై.. నేడు నిత్యాన్నదానంగా మారి ప్రతి రోజూ సుమారు 100 మందికి, గురువారాల్లో సుమారు 200 మందికి అన్నదానం చేస్తున్నస్థాయికి ఎదిగింది. ఏ సమయంలోనైనా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ సహకారంతో 24 గంటలూ తాజా ఆహారాన్ని అందించేందుకు రెండు కమ్యూనిటీ ఫ్రిజ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో కొంత ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరచి ఈ ఫ్రిజ్‌ల్లో ఉంచడం వల్ల అవసరం ఉన్న వారు ఏ సమయంలోనైనా వీటిలో నుంచి తీసుకుని వారి ఆకలి తీర్చుకుంటున్నారు. ఇలా ఎన్నో విశిష్టతలు కలిగిన ఈ ధ్యానమందిరంలో ప్రత్యేక పర్వదినాల్లో పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



మందిరంలో కొలువైన బాబా

ఉగాది, శ్రీరామనవమిలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఈ నెల 9వ తేదీన ఉగాది రోజున 15వ వసంతంలోకి షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం అడుగుపెట్టనుంది. ఉగాది, శ్రీరామనవమి పండగలను పురస్కరించుకొని ధ్యానమందిరంలో పలు పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

భక్తులు, దాతల సహకారంతో సేవలు



భక్తులు, దాతల సహకారంతో గత 14 ఏళ్లనుంచి నిర్విరామంగా అన్నదానం కొనసాగిస్తున్నాం. కరో నా సమయంలోనూ ప్యాకెట్ల రూ పంలో ఆహారం అందజేశాం. మాలలు ధరించిన స్వాములకు గతేడాది నుం చి 60 రోజుల పాటు ప్రత్యేక అన్నదానం నిర్వహించాం. కమ్యూనిటీ ఫ్రిజ్‌ల ద్వారా ఏ సమయంలోనైనా పేదలు, అన్నార్తుల ఆకలిని తీర్చగలుగుతున్నాం.

-నూకల శేషగిరిరావు, ధ్యానమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు

విశాఖను డ్రగ్స్ సిటీగా మార్చేశారు

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 5: విశాఖను డ్రగ్స్ సిటీగా మార్చేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ విమర్శించారు. శుక్రవారం రైల్వేన్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ సరఫరా చేసింది మీరంటే మీరు అని టీడీపీ, వైసీపీ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయన్నారు. రాష్ట్ర రాజధానిగా విశాఖ ను చేస్తానన్న హామీ అమలుకాలేదన్నారు. రాజధాని కోసమంటూ రుషికొండ లో కొండ మాయం చేశారని ఎద్దేవా చేశారు. తాను విశాఖ వాసి నేనని ఆయన గుర్తు చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఉత్తమ పర్యాటక నగరంగా విశాఖను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటానన్నారు. స్టీల్‌ప్లాంట్ విలువ రూ.8 లక్షల కోట్లు అయితే రూ. 8వేల కోట్లకు వి క్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి పరి శ్రమకుచెందిన 33 వేల ఎకరాల్లో 19,200 ఎకరాలు మాత్రమే మిగిలాయన్నారు. ఇంకా ప్లాంట్‌లో 8,500 ఉద్యోగాలు భర్తీ చేయలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ రూ.8 లక్షల కోట్లు నష్టాల్లో ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యేసుపాదం, జిలుకర రవికుమార్ పాల్గొన్నారు.

పాతకక్షలతో యువకుడిపై కత్తితో దాడి



సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

మర్రిపాలెం, ఏప్రిల్ 5: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధి అర్ అండ్‌బీ జంక్షన్ సమీపంలోని అంబేడ్కర్ కాలనీలో స్థానికులు కొందరు ఆ ప్రాంతంలో ఉంటున్న యువకుడి పై మూకుమ్మడి దాడికి పాల్పడటంతో కత్తిపోట్లకు లోనుచేశారు. గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గురువారం సాయంత్రం అంబేడ్కర్ కాలనీలో సంత జరుగుతుండగా కల్లిపిల్లి ఏసురత్నం వద్దకు కాలనీకి చెందిన ఉదయ్ కుమార్, రాజ్‌కుమార్, జగదీష్, సన్యాసిరావు, కార్తీక్, శివశంకర్, వచ్చి మీ కుమారుడు అభిషేక్‌ను చంపేస్తామని బెదిరిం చారు. దీంతో ఆమె తన చెల్లి అయిన కుప్పిరాల మరియకు చెప్పింది. ఈలోగా విధులు ముగించుకొని వచ్చిన అభిషేక్‌పై పైన పేర్కొన్న యువకులు దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్నమరియ చిన్నకొడుకు తేజ (మూగ, చెవిటి వ్యక్తి), పెద్దకొడుకు దావీదులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఇంతలో దాడికి పాల్పడిన వారిలో ఒకరైన జగదీష్ కత్తితో తేజను కడుపులో పొడవగా తీవ్ర గాయమైంది. తేజాను పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చిన స్థానికులు జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు రాత్రి సమయంలో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన ము గ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న తేజ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అధ్వర్యంలో ఘటన జరిగిన ప్రాంతంలో ప్రత్యేక బలగాలు కాపలా కా స్తున్నాయి.ఇప్పటివరకు ఈకేసులో ప్రమేయం ఉన్న ఆరుగురిని అదపులోకి తీసుకుని విచారి స్తున్నారు. తేజ తల్లి ఫిర్యాదు మేరకుసీఐ చక్రధర్‌రావు నేతృత్వంలో కేసు నమోదు చేసి ఎస్సై రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

7న విశాఖ కళాకారుల ఉగాది వేడుకలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 5: విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉగాది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు జనార్దన్ మాట్లాడుతూ, ఆరోజు జబర్దస్త్ ఆర్టిస్టు రాపేటి అప్పారావు, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని గోక డింపుల్, ప్రముఖ కుచిపూడి నృత్య దర్శకుడు టి.సందీప్, పల్సర్ బైక్ ఝాన్సీ, సినీ కొరియోగ్రాఫర్ సీహెచ్ రమేష్‌మాస్టర్, పౌరాణిక నాటకాల నటుడు యడ్ల గోపాలరావు, భాగవతార్, ఇతేషసాయి, రమేష్ పట్నాయక్, పీవీ శివప్రసాద్ తదితరులకు ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్నామన్నారు. సమావేశంలో బ్రహ్మకుమారీస్ రామేశ్వరీ, గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజు పట్నాయక్, శివజ్యోతి, మోహర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'అవినీతి నిర్మూలనే జై భారత్ పార్టీ లక్ష్యం'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 5: అవినీతి నిర్మూలనే లక్ష్యంగా జై భారత్ నేషనల్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమైందని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్ కన్నేపల్లి మహదేవ్ కల్యాణ్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉచిత విద్య, అభివృద్ధి దిశగా తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుల ధ్యేయమన్నారు. సమావేశంలో పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి ఆడారి శరత్‌చంద్ర, పెందుర్తి ఇన్‌చార్జి రవితేజ పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 5: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా ఎర్నాకులం-బ్రహ్మపూర్, చెన్నై ఇగ్మోర్-సంత్రాగచ్చి మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ మధ్య రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06087 నంబరు గల రైలు ఈనెల ఆరు నుంచి మే 25వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మ ర్నాడు ఉదయం 5.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల ఎనిమిది నుం చి మే 27 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12.40 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరిసాయంత్రం 6.05 దువ్వాడ, మర్నాడు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

06077 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 11.00 గం టలకు చెన్నై ఇగ్మోర్‌లో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడ, మర్నాడు (సోమవారం) ఉదయం 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 1.48 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై ఇగ్మోర్ చేరుతుంది.

06073 నంబరు రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు ఈనెల ఆరు నుంచి జూన్ మూడు వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ, సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరిగి ఈనెల ఏడు నుంచి జూన్ నాలుగు వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.42 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.00 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

'దక్షిణ' లోఓటర్లకు తాయిలాల పంపిణీకి యత్నాలు?

జగదాంబ కూడలి, ఏప్రిల్ 5: దక్షిణ వైసీపీ నాయకులు ఓటర్లకు ఇప్పటినుంచే తాయిలాల పంపకాలకు తెరతీస్తున్నారు. వైసీపీ తరపున ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఈ నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్నారు. ఈనేపథ్యంలో వార్డు స్థాయిల్లో బీసీ కులాలు, యువజన సంఘాలతోపాటు ముస్లిం ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకుప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల ప్రచారం ఒకవైపు చేస్తూ.. మరోవైపు ఆయా వార్డులో బలమైన బీసీ వర్గాలు, మైనార్టీల వర్గాలతో రహస్య మంతనాలు జరుపుతున్నారు. వాసుపల్లికి ఓటు వేయాలని, అందుకు ప్రతిఫలం చూపుతామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు సమాచారం. శుక్రవారం వార్డులో వైసీపీ అనుయాయులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈనేపథ్యంలో వార్డులోని ముస్లింలు, బీసీ కులవర్గీయులున్న కుమ్మరవీధి, జెండాచెట్టు ప్రాంతాల్లో వాసుపల్లి అనుచరగణం పలు ఆశలు చూపుతూ ప్రలోభాలకు పాల్పడినట్టు సమాచారం. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

విశాఖపట్నం, ఏప్రిల్ 5: విశాఖ రైల్వే స్టేషన్‌లో యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాలివి.. తూర్పుగోదావరి, తొండంగి గ్రామానికి చెందిన యువతి ఈనెల నాల్గో తేదీన ఇంట్లో చెప్పకుండా విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరి నట్టు బంధువు ద్వారా సమచారం అందుకున్న యువతి తండ్రి, ఇక్కడికి చేరుకుని వెతికినా కనిపించలేదు. దీంతో తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఆచూకీ తెలిసినవారు జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజనాయుడు ఫోన్:94406 27547, ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఫోన్:9866 413487లకు సమాచారమివాలన్నారు.

ఎన్నికల్లో పారదర్శకంగా ఉండాలి: ఆర్‌వో

సీతమ్మధార, ఏప్రిల్ 5: పీడబ్ల్యూడీ ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వారి వివరాలు సేకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.అఖిల కోరారు. సీతమ్మధార తహశీల్దార్ జి.రామ్మూర్తి సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు, ఎన్నికల సూపర్‌వైజర్లతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలకు అవగాహనకల్పించాలని కోరారు.

పాఠశాలల్లో గుడ్డు బంద్

... 5వ పేజీ తరువాయి

రెండు నెలల వ్యవధిలో సొమ్ములు అవుతుంటాయి. అయితే నాలుగు నెలలకుపైబడి బిల్లులు అందకపోవడంతో సరఫరాదారులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు భరోసా ఇచ్చినా ఇప్పటివరకూ విడుదల కాలేదు. దీంతో గుడ్లు సరఫరా నిలిపివేయాలని సరఫరాదారులు నిర్ణయించారు. దాదాపు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో గుడ్లు సరఫరా ఆపేశారు. జిల్లాలో ఈనెల ఒకటో తేదీ నుంచి గుడ్లు సరఫరా నిలిపివే శారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే గుడ్లు సరఫరా కావడం లేదని టీచర్లు చెబుతున్నారు. కాగా, వారానికి మూడు రోజులు చిక్కీలు ఇస్తుంటారు. వాటి సరఫ రాదారుడికి కూడా బిల్లులు చెల్లించడం లేదు. అయితే చిక్కీలు తయారుచేసే కాంట్రాక్టర్ ప్రస్తుతం తన వద్ద సరకు ఉన్నంత మేరకు పాఠశాలలకు సరఫరా చేసి తరువాత పంపిణీకి స్వస్తి చెప్పాలని నిర్ణయించారు. పాఠశాలల్లో గుడ్లు సరఫరా నిలిపివేయడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పిల్లలకు ఇచ్చే గుడ్లుకు ప్రభుత్వం వద్ద పైసలు లేవా అంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుడ్ల సరఫరాదారులకు రూ.150 కోట్ల వరకు బకాయి ఉన్నట్టు తెలిసింది.

మండిన విశాఖ

... 5వ పేజీ తరువాయి

తగ్గించాలి. మద్యం తాగకుండా ఉండడం మేలు. ఎండవేళ శరీరంపై భారం పడే పనులకు దూరంగా దూరంగా ఉండాలి.

60 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా

ఆరోగ్య శాఖ ఒకపక్క ప్రజలకు అవగాహన కల్పిస్తూనే.మరోపక్క ఎండ దెబ్బతిన్న వాళ్లు రీహైడ్రేట్ అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఓఆర్‌టీ (ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ) కార్నర్స్ ఏర్పాటుచేస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, అంగన్‌వాడీ సెంటర్లు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ఈ ఓఆర్‌టీ కార్నర్స్‌ను ఏర్పాటుచేయనున్నారు. ఈ కార్నర్స్‌లో ఆరోగ్య శాఖకు చెందిన సిబ్బంది ఒకరు ఉంటారు. అక్కడ ప్రత్యేకంగా ఓఆర్ఎస్ ద్రావణం, వడదెబ్బ తగిలిన వారికి అందించాల్సిన ప్రాథమిక వైద్యానికి సంబంధించిన మందులు ఉంటాయి. ఇందుకోసం 60 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేసినట్టు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. మరో ఆరు లక్షల ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని, ఎండ తీవ్రత కొనసాగినంత కాలం కార్నర్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

వడదెబ్బ తగిలితే...

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకువెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ఇలా చేస్తుండాలి. ఫ్యాన్ గాలి, చల్లని గాలి తగిలేలా చర్యలు చేపట్టాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజు ద్రావణం, ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) ఇవ్వాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బెవర సత్యనారాయణ

... 5వ పేజీ తరువాయి

సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా పనిచేస్తామన్నారు.

రౌడీషీటర్ల వద్ద తుపాకులు

... 5వ పేజీ తరువాయి

బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు అతడి వద్ద నుంచి పిస్టల్‌తోపాటు రెండు బుల్లెట్‌లను సాధీనం చేసుకున్నారు. ఆ తరువాత రెండు రోజులకే రామాటాకీస్ సమీపంలోని ఒక ప్రైవేటు ట్రావెల్స్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి నుంచి ఒక పిస్టల్, రివాల్వర్‌తోపాటు రెండు బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల కిందట ఆరిలోవ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ కిట్టూ నుంచి ఒక పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతానికి ముగ్గురు నుంచి తుపాకీలు బయటపడినప్పటికీ మరికొందరు రౌడీషీటర్లు, ఆకతాయిల వద్ద కూడా ఇలాంటి తుపాకీలు, రివాల్వర్లు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. భవిష్యత్తులో ఏదో ఒకరోజు బెదిరింపులు, సెటిల్‌మెంట్ల సమయంలో వీటిని బయటకు తీసే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలో మాదిరిగా రౌడీషీటర్ల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటుచేసినట్టయితే వారి ఆగడాలకు ముకుతాడు వేయడంతోపాటు వారి వద్ద ఉన్న లైసెన్స్ లేని ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకోవచ్చునని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

అంగన్‌వాడీల ఆశలు వమ్ము

... 5వ పేజీ తరువాయి

చెల్లించాలి. కానీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి ఉన్నారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పని భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో గత ఏడాది డిసెంబరు నుంచి సుమారు 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెతో ఇబ్బంది కలుగుతోందని భావించిన ప్రభుత్వం...సంఘ నాయకులతో చర్చలు జరిపింది. ఈ డిమాండ్లను అమలు చేయడానికి అంగీకరించింది. అయితే, వీటిలో రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు సంబంధించి జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మె కాలానికి సంబంధించిన పూర్తి వేతనాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ వేతనాన్ని కూడా ఇప్పటివరకూ విడుదల చేయలేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికీ కమిటీని ఏర్పాటు చేయలేదని, తమను నమ్మించి ఈ ప్రభుత్వం మోసం చేసిందంటూ అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షు రాలు మణి ఆరోపించారు. అంగన్‌వాడీలను జగన్ మోసం చేశారని, ఎన్నికల సమ యంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయారని అనకాపల్లి ప్రాం తంలో పని చేస్తున్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తంచేశారు. సమ్మె సమ యంలో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు...ఒక్క డిమాండ్‌ను మాత్రమే నెరవేర్చే దిశగా చర్యలు తీసుకున్నారని విశాఖ నగర పరిధిలో పనిచేస్తున్న మరో అంగన్‌వాడీ ఉద్యోగి వాపోయారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లో ఉందని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

విద్యార్థులకు రోజుకు మూడుసార్లు తాగునీరు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 5 : వేసవి తీవ్రత దృష్ట్యా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజూ మూడుసార్లు తాగునీటి విరామం ఇవ్వాలని విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మాత్రమే పనిచేస్తున్నాయి ఈ సమయంలో తాగునీటి విరా మం ఒక పూట మాత్రమే ఉంది.తాజా ఉత్తర్వుల మేరకు ఉదయం 8.45, 10.05, 11.50 సమయాల్లో తాగునీటి విరామం ఇవ్వాలని, పిల్లలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఉపాధ్యాయులను ఉత్తర్వుల్లో ఆదేశించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

తగరపువలస, ఏప్రిల్ 5 : తగరపువలస బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ జీవీఎంసీ మొదటి డివిజన్ పరిశీలకుడు జీవన్‌రామ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించడానికి నాయ కులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఒకటి, రెండు వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 5 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వార్డులోని జేఆర్‌నగర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెలగపూడికి, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీహెచ్ గోవింద్, కర్రి గౌరీ, డి. సన్యాసమ్మ, మొల్లి శోభ, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, జి. అప్పన్న, ఆర్. నూకరాజు పాల్గొన్నారు.

రేఖవానిపాలెంలో వైసీపీ ప్రచారం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 5 : మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీలో వైసీపీ నాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకి మద్దతుగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించి, వైసీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని గెలిపించండి : ఎంపీ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 5 : ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ఆయన 17 వార్డులోని ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరులో ప్రచారం నిర్వహించారు. జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి మరింత ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు గేదెల లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబును సీఎం చేద్దాం'

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 5 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం అన్నారు. శుక్రవారం ఆయన ఈస్ట్ పాయింట్ కాలనీలోని పలు అపార్టుమెంట్లలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి, సత్తిబాబు, శివ, నరేంద్ర, గోపి, ఈశ్వరరావు, దేముడుబాబు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ఆరిలోవ, ఏప్రిల్ 5 : జీవీఎంసీ 12వ వార్డు శ్రీకాంత్‌నగర్ లేఅవుట్‌లో అక్రమంగా వేస్తున్న కంచె నిర్మాణ పనులను జోన్ త్రీ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శాస్త్రి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం అడ్డుకున్నారు. దీంతో స్థల యజమాని వచ్చి తమకు ప్రేమ సాయి నుంచి స్థలం దఖలు పడిందని, కోర్టు కూడా అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఏసీపీకి వివరించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ స్థలం జీవీఎంసీకి చెందినదని, ఏదైనా ఉంటే ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని వారికి స్పష్టం చేశారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 25, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబటి 24, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 32, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 42, ఆగాకర 52, పొటల్స్ 48, కీరదోస 24, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



కోరాడ రాజబాబుతో మాజీ మంత్రి గంటా, తదితరులు



పంచకర్ల సందీప్‌తో మాజీ మంత్రి గంటా చర్చ

కూటమి నాయకులతో గంటా భేటీ

విశాఖపట్నం, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కూటమి నాయకులను కలిసి మాట్లాడారు. నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ఆయన తరపున పోటీ చేయాలని భావించారు.గత ఎన్నికల్లో కూడా ఆయన అక్కడి నుంచే పోటీ చేశారు. అయితే టీడీపీ. జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడంతో భీమిలిలో టీడీపీ అభ్యర్థిని పోటీకి దింపాలని నిర్ణయించారు. ఇటీవల మాజీమంత్రి గంటా శ్రీనివాసరావును భీమిలి అభ్యర్థిగా ప్రకటించారు. అప్పటివరకు భీమిలి టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉన్న కోరాడ రాజాబాబు కూడా టికెట్ ఆశించారు. అటు సందీప్, ఇటు కోరాడ రాజబాబు ఇద్దరూ టికెట్ రాలేదని కొంత అసంతృప్తితో ఉన్నారు. అయితే మూడు పార్టీలు కలిసి కూటమి విజయం కోసం పనిచేయాలని పార్టీల పెద్దలు సూచించడంతో అందరినీ కలుపుకొని వెళ్లే దిశగా గంటా శ్రీనివాసరావు ప్రయత్నాలు ప్రారంభించారు. నగరంలోని ఆశీల్‌మెట్ట ప్రాంతంలో ఉంటున్న కోరాడ రాజబాబు ఇంటికి శుక్రవారం వెళ్లి కలిసి మాట్లాడారు. పార్టీ విజయం కోసం, చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయడానికి సహకరించాలని కోరారు. అలాగే ఎంవీపీ కాలనీలో ఉంటున్న పంచకర్ల సందీప్ ఇంటికి వెళ్లి కలిశారు.

పెదవాల్తేరు : ఉత్తరాంధ్ర అభివృద్ధికి, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ మూడు పార్టీలతో సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గ, మండల స్థాయి సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి, కలిసికట్టుగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, నాయకులు ప్రకాష్‌రెడ్డి, శ్రీకాకుళం ఇన్‌చార్జి విజయానందరెడ్డి, ఆర్‌టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాసబాబు, భీమిలి నియోజకవర్గం కన్వీనర్ కె. రామానాయుడు, ఎస్.కోట నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీరంగం దానేష్ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : వెలగపూడి

ఎంవీపీ కాలనీ/ఆరిలోవ, ఏప్రిల్ 5 : తూర్పు నియోజకవర్గంలోని 19 వార్డులో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు రక్షణ ఉండేదని, వారి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని చెప్పారు. కాగా ఆరిలోవ 13వ వార్డు శివాజీనగర్ ఆపరేషన్ కాలనీలోని మజీద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకొండ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి సురేష్, మహిళా అధ్యక్షురాలు రమణి, నూకరాజు, మురళి, శ్రీను, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యం

పెదవాల్తేరు : వైసీపీ పేదలను ఆదుకునే ప్రభుత్వం కాదని, పేదలను బానిసలను చేసే ప్రభుత్వమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. శుక్రవారం 19వ వార్డులో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం వంద కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, చైర్మన్లను ఉత్సవ విగ్రహాలగా మార్చిందని, ఐదేళ్లలో బీసీలకు ఎటువంటి వ్యక్తిగత రుణాలు, పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. బలహీన వర్గాలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం టీడీపీతోనే సాధ్యమని, టీడీపీ పాలనలో బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి జయహో బీసీ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి



కాపులుప్పాడలో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

గెలిపిస్తే సేవకుడిగా ఉంటా

▸ భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 5 : జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు కాపులుప్పాడ, పరదేశిపాలెం, ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్ర వారం ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009, 2019 ఎన్నికల్లో తనను ఆదరించి, శాసనసభకు పంపించారని, ఈసారి కూడా అందరి ఆదరాభిమానాలతో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా ఉంటానని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అత్యధికంగా ఈ వార్డులోనే అందించానని వివరించారు. ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా గెలిపించాలని కోరారు. వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మహిళలు అవంతికి అడుగడుగునా హారతులతో స్వాగతం పలికారు.



పాతపరదేశిపాలెంలో బట్టలకు ఇస్త్రీ చేస్తూ..

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఏప్రిల్ 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు,శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఏకాదశి తిరువీధి ఉత్సవం



సింహాచలం, ఏప్రిల్ 5 : ఫాల్గుణ మాస బహుళపక్ష ఏకాదశి పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవళంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉత్సవమూర్తి మదన గోపాలస్వామిని ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచారు. పండితుల వేద మంత్రోచ్చారణలు, విద్వాంసుల నాదస్వరాలాపనలు నడుమ ఆలయ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలు సమర్పించారు.

అప్పన్నను దర్శించుకున్న జీవీఎంసీ కమిషనర్

సింహాచలం, ఏప్రిల్ 5 : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు కమిషనర్ గోత్రనామాలతో స్వామికి పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



సిరిపురం : వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కీర్తి, తదితరులు



భీమిలిలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్

▸ వాడవాడలా జయంతి

▸ రామ్ సేవలను కొనియాడిన వక్తలు

భీమునిపట్నం, ఏప్రిల్ 5 : తూర్పు. భీమిలి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లోనూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ పోరాటయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని బీచ్ రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పతివాడ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వంలో 50 ఏళ్ల పాటు జగ్జీవన్‌రామ్ ఎంపీగా పని చేసి ప్రపంచ రికార్డు సాధించారన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు పతివాడ రాంబాబు మాట్లాడుతూ దళిత ఉద్యమ స్ఫూర్తికి వన్నె తెచ్చిన గొప్ప దార్శనికుడు, అణగారిన వర్గాల ఆశా దీపం జగ్జీవన్ రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ విభాగం రైతు సంఘం ప్రధాన కార్యదర్శి దంతులూరి అప్పలనరసింహరాజు, మారోజు సంజీవ్‌కుమార్, గండిబోయిన పోలిరాజు, అప్పన్న, మురళి, కాళ్ల సూర్య రామకృష్ణారావు, పోతురాజు, చిన్న, హరీష్ పాల్గొన్నారు.

కొమ్మాది : స్థానిక గురుకుల ప్రతిభా మహిళా పాఠశాలలోనూ జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త ఎస్. రూపావతి, తదితరులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టి. నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లోనూ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆయన ఆశయాల కోసం పోరాడిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.

ఏయూలో...

వెంకోజీపాలెం : ఏయూలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అధికారులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ వి. కృష్ణమోహన్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య కె. దుర్గాకుమారి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు, జి. శశిభూషణరావు, విజయలక్ష్మి, షారోన్‌రాజు పాల్గొన్నారు.

ద్వారకాబస్‌స్టేషన్ : మద్దిలపాలెంలోని కామ్రేడ్ రామ్మోహన్ భవన్‌లో ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, మద్దిలపాలెం డిపో అధ్యక్షుడు ఎం. ఈశ్వరరావు, సీసీఎస్ డెలిగేట్ నారాయణ పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో...

సిరిపురం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బాబూ జగ్జీవన్‌రామ్ అని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి డి. కీర్తి అన్నారు. సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో ఆమె జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

సింహాచలం : సింహాచలం దేవస్థానం కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఈఓ శ్రీనివాసమూర్తి, పాత అడివివరం అంబేడ్కర్ కాలనీ వద్ద 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, నవయువ దళిత సేవా సంఘం సభ్యులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

అణగారిన వర్గాల పెన్నిధి

ఎండాడ : అణగారిన వర్గాల పెన్నిధి జగ్జీవన్ రామ్ అని రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు అన్నారు. ఎండాడలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పద్మనాభం (రూరల్) : అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు అన్నారు. అనంతవరంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు.



గంటా శ్రీనివాసరావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

వాంబే కాలనీలో గంటాకు మద్దతుగా ప్రచారం

మధురవాడ, ఏప్రిల్ 5 : జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ వాంబేకాలనీలో భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. మహిళా నాయకులు ప్రతి ఇంట్లో మహిళలకు బొట్టు పెట్టి గంటాకు ఓటెయ్యమని అభ్యర్థించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాజు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు,టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, వార్డు ప్రధాన కార్యదర్శి కానూరి అచ్చుతరావు, పోతిన నాయుడు,కిశోర్, మల్లువలస రాము, మహిళా నాయకులు కాంతమ్మ, లావణ్య, సత్యవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తొమ్మిదో వార్డులో వెలగపూడికి మద్దతుగా..

విశాలాక్షినగర్, ఏప్రిల్ 5 : తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబుకు మద్దతుగా పార్టీ నాయకులు శుక్రవారం 9వ వార్డులోని పోలీస్ క్వార్టర్స్, పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మైలపల్లి శ్రీను, గరికిన నూకరాజు, గొలగాని వెంకన్న, అన్నె రాజా, మహిళా మోర్చా నాయకులు స్పందన, కల్యాణి, లక్ష్మి, జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

డాక్టర్ బూసి వెంకటస్వామికి ఉగాది పురస్కారం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 5 : చెన్నైలోని మెరీనా ఆవరణలో మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆధ్వ ర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఏయూ తెలుగు విభాగాచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి పురస్కారం అందుకున్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు సినీ గేయ రచయిత భువనచంద్ర ముఖ్య అతిథిగా హాజరై వెంకటస్వామికి ఉగాది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా భువన చంద్ర మాట్లాడుతూ తెలుగు భాష సాహిత్యానికి సేవ చేయడం అందరికీ సాధ్యం కాదని, కొద్ది మందికే ఆ అవకాశం ఉంటుందని చెప్పారు. కాగా మద్రాస్ వర్సిటీ ఉగాది పురస్కారం అందు కున్న డాక్టర్ బూసి వెంకటస్వామికి తెలుగు సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది

మధురవాడ, ఏప్రిల్ 5 : గాయత్రి విద్యా పరిషత్ వైద్య కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం కళాశాల కార్యదర్శి ఆచార్య వి. సోమరాజు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా రక్తం అవసరమైతే 7675808026 నంబరును సంప్రతించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎస్. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ, ఏప్రిల్ 5 : ఎన్నికల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని ఆరిలోవ సీఐ గోవిందరావు అన్నారు. శుక్రవారం ఆయన గాంధీనగర్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు మద్యం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమాలకు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ, గాంధీ నగర్, అన్నానగర్, బాలాజీ నగర్, రాజీవ్ నగర్‌కు చెందిన రౌడీ షీటర్లు పాల్గొన్నారు.

విద్యార్హత ఆధారంగా అభ్యర్థుల జాబితా

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 5 : కులమతాల ఆధారంగా కాకుండా కేవలం విద్యార్హత బట్టి అభ్యర్థుల జాబితా రూపొందించినట్టు జై భారత్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడారు. ఎంపీ స్థానాలకు అరకు, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, కర్నూలు, హిందూపూర్, తెలంగాణలో 3 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను నిలుపుతున్నట్టు చెప్పరు. ఏపీలో అన్ని జిల్లాల్లో అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామని తెలిపారు. ఉగాది తర్వాత అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామన్నారు.

రూ. 7 లక్షల నగదు స్వాధీనం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 5 : ఉషోదయ కూడలిలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీ చేపట్టగా ఓ వ్యక్తి వద్ద రూ. 7 లక్షల నగదు దొరికింది. సరైన ఆధారాలు చూపించలేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు.